ఆర్థిక సాయం



జియాగూడ: డోలక్ కృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశామని కురుమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, కార్యదర్శి నరసింహ, నగర అధ్యక్షుడు వినోద్‌కుమార్, బుచ్చయ్య తెలిపారు. ఆదివారం కురుమ బస్తీలో కురుమ సంఘం సభ్యులు డోలక్ కృష్ణ సతీమణికి రూ.75 వేల చెక్కును అందజేశారు. జియాగూడ కురుమ సంఘం అధ్యక్షుడు రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, ఈశ్వరయ్య, శివశంకర్, హనుమంత్‌రావు, అమర్నాథ్ పాల్గొన్నారు.

బీజేపీ ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడిగా సాయిప్రసాద్



చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా అధ్యక్షుడిగా ఎం.సాయిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్ డివిజన్ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడితో పాటు బాలు వాల్మీకి, జె.హన్మంత్, జి.రాజు, నరేష్, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం జయ, ఎం.వెంకటేష్, కార్యదర్శులుగా సాయి, సుధాకర్, రాఘవేందర్, శ్యామలా, కోశాధికారిగా జి.రాజు, 25 మంది సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ..ఉప్పుగూడ డివిజన్‌లో పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

కిట్ల పంపిణీ



గౌలిపురా: గౌలిపురాలోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ మిత్ర క్లబ్‌లో ఆదివారం జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపు కోచర్లకు గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, జీహెచ్ఎంసీ సౌత్ జోన్ ఇన్‌స్పెక్టర్ రఫి అలీ కిట్లను పంపిణీ చేశారు. సదానంద్ చారి, ఇమ్మానియేల్, రమేశ్, మారుతీరావు, జమాల్‌పూర్ అశోక్, దుర్గారాజ్, కృష్ణారావు, శ్రీశైలం పాల్గొన్నారు.

రేషన్..పరేషాన్!

- మూడు నెలల బియ్యం పంపిణీకి తొలి రోజే కష్టాలు
- సాంకేతిక ఇబ్బందులతో లబ్ధిదారుల అవస్థలు
- రేషన్ షాపుల వద్ద బారులు తీరిన జనం

చార్మినార్: మూడు నెలల రేషన్ పంపిణీ పాతబస్తీలో గందరగోళంగా మారింది. ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ మూడు నెలలకు సంబంధించి మూడు సార్లు ఈ పాస్ మిషన్‌పై బయోమెట్రిక్ చేయాల్సి ఉండటంతో సమస్యలు తలెత్తాయి. ఒక్కోసారి సర్వర్ డౌన్ కావడంతో రేషన్ పంపిణీలో తీవ్రంగా ఆలస్యం జరిగింది. మూడు నెలలకు సరిపడా రేషన్ ఇంటికి తీసుకువెళ్లడానికి రేషన్ కార్డుదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

కార్వాన్ నియోజకవర్గంలో..

గోల్కొండ: మూడు నెలల రేషన్ ఒకేసారి ఇచ్చే పథకం ఆదివారం నుంచి ప్రారంభమైంది. దీంతో కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ రేషన్ షాపుల ముందు ఉదయం మాత్రం హడావిడి కానవచ్చింది. గోల్కొండ, లంగర్‌హౌస్, నానల్‌నగర్ తదితర డివిజన్లలో ఉదయం 7 నుంచే రేషన్ కోసం షాపుల ముందు బారులు కనిపించాయి. పలు చోట్ల రేషన్ డీలర్, కార్డు దారుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. థంబ్ మెషిన్‌లు పని చేయకపోవడంతో పలు ప్రాంతాల్లో రేషన్ పంపిణీకి ఆలస్యం జరిగింది.



గౌలిపురాలో..

చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో..

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని రేషన్‌షాప్‌ల వద్ద జనాలు పెద్ద ఎత్తున క్యూలైన్లలో నిలబడ్డారు. ఒక్కోకార్డు దారుడికి సరుకులు ఇచ్చేందుకు దాదాపు 20 నిమిషాల సమయం తీసుకోవడంతో తొలిరోజు పంపిణీ మందకొడిగా కొనసాగింది. ఉప్పుగూడ, లలితాబాగ్, జంగమ్మెట్, రియాసత్‌నగర్, చాంద్రాయణగుట్ట, బార్కాస్, కంచన్‌బాగ్ డివిజన్లలో తొలిరోజు కార్డుదారులకు ఇబ్బందులు తప్పలేదు.



యాకుత్‌పురాలో రేషన్ షాపుల వద్ద బారులు తీరిన లబ్ధిదారులు





బాంజావాడీ రేషన్ షాపు వద్ద..



రాజన్నబావి సమీపంలోని దుకాణం వద్ద..

గౌలిపురా డివిజన్‌లో..

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని హనుమాన్‌నగర్, అచ్చయ్యనగర్, దానయ్యనగర్ తదితర ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల వద్ద ప్రజలు రేషన్ సరుకుల కోసం క్యూ కట్టి కనిపించారు. సర్వర్ సమస్యలతో లబ్ధిదారుల వేలిముద్రలు రాకపోవడంతో ఒక్కొక్కరికి రేషన్ సరుకులను అందించేందుకు 10–15 నిమిషాల సమయం పట్టింది.

యాకుత్‌పురాలో..

యాకుత్‌పురా: యాకుత్‌పురాలోని పలు రేషన్ షాపులో ఆన్‌లైన్ సర్వర్ డౌన్‌తో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. యాకుత్‌పురా, బ్రహ్మణ్‌వాడి, రెయిన్‌బజార్, బడా బజార్, జాఫర్ రోడ్డు, రంగేలీ కిడికి, ఆమన్‌నగర్–ఏ, ఎస్ఆర్టీ కాలనీ, తలాబ్‌కట్టా, చాచా గ్యారేజ్, నషేమన్ నగర్, భవానీనగర్, మొఘల్‌పురా, సుల్తాన్‌షాహి తదితర ప్రాంతాలోని రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు ఉదయం నుంచి బారులు తీరి కనిపించారు.

శోభన దేశ్‌పాండేకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

అబిడ్స్: వనిత మహా విద్యాలయ ప్రిన్సిపాల్, విద్యావేత్త డాక్టర్ శోభన దేశ్‌పాండేకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్–2025 అవార్డును తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అందజేశారు. 37 ఏళ్లకు పైగా విద్యారంగంలో విశేష కృషి చేసిన ఆమెకు ఈ అవార్డును తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి చెక్కుల విజ్ఞత ఆమెకు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా విజ్ఞత మాట్లాడుతూ..విద్యార్థుల అభ్యున్నతికి విద్యారంగ వ్యాప్తికి శోభన దేశ్‌పాండే ఎంతో కృషి చేసిందని కొనియాడారు. అనంతరం కళాశాల కార్యదర్శి ఏనుగుల రాజేందర్ మాట్లాడుతూ..విద్యార్థులను అన్ని రంగాల్లో ఆమె తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ అవార్డు గ్రహీత శోభనా దేశ్‌పాండేను అభినందించారు.



శోభనదేశ్‌పాండేకు అవార్డును అందజేస్తున్న విజ్ఞత

అందరి సహకారంతో బోనాలు విజయవంతం చేస్తాం

గోల్కొండ: అందరి సహకారంతో కోట బోనాలు విజయవంతం చేస్తామని కాంగ్రెస్ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జీ ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజిరీ అన్నారు. ఆదివారం బోనాల నిర్వహణపై జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు బోనాల నిర్వహణ కమిటీ చైర్మన్ కె.చంటిబాబును జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల నిర్వహణపై తాము దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కూడా కలిశామన్నారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్.శ్రీకాంత్, సురేష్‌గౌడ్, బి.అనిత, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులున్నారు.



చంటిబాబును సన్మానిస్తున్న సాయిబాబాచారి తదితరులు

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



బాలస్వామి

గౌలిపురా: బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని భవానీ నగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ..బక్రీద్ సందర్భంగా ముస్లింలు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు అందజేసిన ప్లాస్టిక్ కవర్లలో వాటిని వేసి ఆటోరిక్షా కార్మికులకు అందజేయాలన్నారు. వ్యర్థాలను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేస్తే కుక్కలు వాటిని ఇతర ప్రాంతాలకు తీసుకెళితే శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అలీ మస్కతి

చార్మినార్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం జరుగుతోందని ఆ పార్టీ సీనియర్ నాయకులు అలీ మస్కతి అన్నారు. ఈనెల 2న నిర్వహించుకునే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి హయాంలోని తమ ప్రభుత్వం ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేస్తుందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియా గాంధీ అన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. మరో 10 ఏళ్ల వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



అబిడ్స్: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని గుడిమల్కాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్టా నాగేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఎస్.ఎస్. తైక్వాండో అకాడమీ నిర్వహించిన కలర్ బెల్ట్ ప్రమోషన్ పోటీల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరంతరం ఆధ్యాత్మికత భావాలతో పాటు క్రీడారంగాల్లో కూడా అందరూ రాణించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ తైక్వాండో అకాడమి కోచ్ శ్రీనివాస్ మడి పగడాల, స్టా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, కార్యదర్శి సురేందర్ సింగ్‌ల ఆధ్వర్యంలో కలర్‌బెల్ట్ ప్రమోషన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు.

పదవీ విరమణ తప్పనిసరి



నర్సింగ్‌రావును సన్మానిస్తున్న టీఎన్జీఓస్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని టీఎన్జీఓస్ కేంద్రం సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రీ చాపల్ రోడ్డులోని స్టాన్లీ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ డిప్యూటీ డీఈఓ నర్సింగ్‌రావు పదవీ విరమణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఉద్యోగులు, టీఎన్జీఓస్ ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మారం జగదీష్, ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. ఉద్యోగులు 30 ఏళ్లకు పైగా వారి ప్రాంతాల్లో చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట్, పాఠశాల విద్యాశాఖ విభాగం కేంద్ర కమిటీ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎం. భాస్కర్, ముజాహీద్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదు

సంతోష్‌నగర్: ఎదురింటి వారు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఓ మహిళ ఆదివారం సంతోష్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం..లలితాబాగ్ కాళికానగర్‌లో క్రికెట్ ఆడుతుండగా బంతి ఎదురుగా ఉన్న వీర్ ఠాకూర్, యువరాజ్ ఠాకూర్, అమర్ ఇంట్లోకి వెళ్లింది. దీంతో హర్షిత గైక్వాడ్‌కు చెందిన పెంపుడు కుక్క ఆ బంతిని తీసుకొచ్చింది. దీంతో వీర్ ఠాకూర్, యువరాజ్ ఠాకూర్, అమర్ హర్షిత గైక్వాడ్ కుటుంబసభ్యులైన సంతోష్ గైక్వాడ్, నగేశ్ గైక్వాడ్‌పై దాడికి పాల్పడ్డారు. దీనిపై హర్షిత గైక్వాడ్ తమ కుటుంబ సభ్యులను ఎదురింటి వారు బెదిరింపులకు పాల్పడుతున్నారని సంతోష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ధర్నాకు తరలిన మజ్లిస్ నాయకులు

గోల్కొండ: రాజ్యాంగానికి తూట్లుపొడుస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం హకీంపేట్‌లో మజ్లిస్ ఆధ్వర్యంలో జరిగిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..11 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను ఒకొక్కటిగా ఉపసంహరించుకుంటుందని ఆరోపించారు. పేద ముస్లింలకు ఎంతగానో దోహదకారిగా ఉంటున్న వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకునే విధంగా వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం ఆయన ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ సవరణ బిల్లుపై ఇందిరాపార్కు వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, షకీల్ అలీఖాన్, హబీబ్‌చౌస్, అలీముద్దీన్ తదితరులున్నారు.



ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాకు హకీంపేట్ నుంచి బైక్‌లపై తరలివెళ్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు